సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 30 । మే । 2024



నాణ్యత లేని వంట..
జిల్లాలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో నాణ్యత లేని, అపరిశుభ్రమైన ఆహార పదార్థాలు తింటూ ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. 8లో



అనుమానాలెన్నో..?
రఘునాథపాలెం మండలం హరియాతండా వద్ద జరిగిన కారు ప్రమాదంలో తల్లీ, ఇద్దరు కుమార్తెల మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 8లో

గరిష్టం / కనిష్టం
41° / 29°

వాతావరణం
జిల్లాలో నేడు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. గంటగంటకూ ఎండ ప్రభావం పెరుగుతుంది. రాత్రికి కూడా ఉక్కపోత ఉంటుంది.

న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, నిత్యకల్యాణానికి భక్తులు భారీగా హాజరయ్యారు.

నేడు బాలాజీ ఆలయానికి చిన్నజీయర్ స్వామి

అన్నపురెడ్డిపల్లి : మండల కేంద్రంలోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి గురువారం శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి రానున్నారని ఆలయ మేనేజర్ పాకాల వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీయర్‌స్వామి ఆలయాన్ని సందర్శించి, బాలాజీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆ తర్వాత ప్రవచనం చేస్తారని, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని మేనేజర్ కోరారు.

ఉద్యోగ నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న 1962, 102 వాహనాల పైలట్(డ్రైవర్) ఉద్యోగాల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ నాగేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో ఈనెల 31న భద్రాచలం ఏరియా ఆస్పత్రిలోని 108 ఆఫీస్‌లో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై బ్యాడ్జ్ లైసెన్స్ కలిగి ఉండాలని, 22 – 35 సంవత్సరాల వయసు గలవారు అర్హులని పేర్కొన్నారు.

3 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

కొత్తగూడెంఅర్బన్: జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, జిల్లాలో పరీక్షల నిర్వహణకు పాతకొత్తగూడెం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల, బూడిదగడ్డ ప్రభుత్వ పాఠశాల, పాల్వంచ బొల్లోరిగూడెంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల, ఇల్లెందులోని సింగరేణి హైస్కూల్, మణుగూరులోని పీవీ కాలనీ, భద్రాచలంలోని కొత్రాజుల గుట్ట జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు అనుమతించేది లేదన్నారు. ఉదయం 9.35 గంటల వరకు మాత్రమే విద్యార్థులను కేంద్రాల్లోకి పంపిస్తామని పేర్కొన్నారు.

జూన్ 4న కార్గో పార్శిళ్ల వేలం

ఖమ్మంమయూరిసెంటర్ : ఖమ్మం బస్టాండ్‌లోని కార్గో అండ్ పార్శిల్ సర్వీస్ నుంచి వినియోగదారులు తీసుకెళ్లని పాత పార్శిళ్లను వచ్చే నెల 4వ తేదీన వేలం వేయనున్నట్లు ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల ఏటీఎం పవన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లాజిస్టిక్ ఆఫీస్ పరిధిలో పెండింగ్ పార్శిళ్ల క్లియరెన్స్ కోసం వేలం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

గురుకులాల్లో నేడు ఇంటర్ అడ్మిషన్లు

పాల్వంచరూరల్ : ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం కేటాయించిన సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో విద్యార్థులు గురువారం ప్రవేశించాలని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ జిల్లా సమన్వయాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రథమ సంవత్సరంలో కేటాయించిన కళాశాలలో జాయిన్ కాకుంటే ఆ సీటును ఖాళీగా ఉన్నట్లు ప్రకటిస్తామని, వాటిని టీజీఎస్ డబ్ల్యూఆర్ఈఐ సొసైటీ ఇచ్చిన ప్రకటన ద్వారా నాన్ రెసిడెన్షియల్ విద్యార్థులతో భర్తీ చేస్తామని పేర్కొన్నారు. విద్యార్థులకు కేటా యించిన కళాశాలల్లో నేడు ప్రవేశాలు పొందాలని సూచించారు.

అక్రమాలపై నజర్..

ఎన్నికల పోలింగ్ ముగిసింది మొదలు జిల్లా వ్యాప్తంగా అక్రమార్కులపై ప్రభుత్వ పరంగా ఫోకస్ పెరిగింది. మైనింగ్, రవాణా, ప్రజారోగ్యం, మున్సిపాలిటీ, రెవెన్యూ తదితర శాఖల్లో జరుగుతున్న అవకతవకల చిట్టా వెలుగు చూస్తోంది. దీంతో అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

వరుసగా కొనసాగుతున్న ఏసీబీ దాడులు
- ఇసుకతో మొదలెట్టి ఆర్టీఏ చెక్‌పోస్ట్‌ల వరకు..
- కారుణ్య నియామకాలపైనా విచారణ
- అవినీతిపరుల గుండెల్లో గుబులు



భద్రాచలంలోని ఓ హోటల్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

మైనింగ్‌తో ప్రారంభమై..
తెలంగాణ ఏర్పాటైన తర్వాత కొత్త ఇసుక పాలసీని అమల్లోకి తెచ్చారు. అయితే ఆ తర్వాత కాలంలో కాలానుగుణంగా మార్పులు చేయకపోవడం, నిఘా కొరవడడంతో ఇసుక రీచ్‌లు అక్రమాలకు కేరాఫ్‌గా మారాయి. నిబంధనలకు తూట్లు పొడవటం, ఓవర్‌లోడ్, జీరో బిల్లుల రూపంలో ఇసుక ర్యాంపుల్లో అక్రమాలు తిష్ట వేశాయి. అయితే గత కొన్ని రోజులుగా ఓవర్‌లోడ్, జీరో దందాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. దీంతో తెర ముందు గిరిజన సొసైటీలను ఉంచి తెర వెనుక కథ నడిపించే కొందరు రైజింగ్ కాంట్రాక్టర్లు కంగుతిన్నారు. అవినీతి దందాకు అడ్డుకట్ట పడడంతో ర్యాంపుల్లో ఇసుక అమ్మకాలు తగ్గించేశారు.

హోటళ్లలో పరిశుభ్రత ఎక్కడ..
కొత్త జిల్లాగా ఏర్పాటై ఎనిమిదేళ్లు కావస్తున్నా ఇప్పటికీ ప్రజారోగ్య విభాగం అచేతనంగానే ఉండిపోయింది. అనుమతులు జారీ చేయడం తప్పితే తనిఖీలు అన్న మాటే కానరావడం లేదు. కానీ గత పది రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా హోటళ్లలో తనిఖీలు పెరిగాయి. జిల్లాలో పర్యాటకులు, భక్తులు ఎక్కువగా వచ్చే భద్రాచలంలోని ప్రముఖ హోటళ్లలో ఇప్పటికే తనిఖీలు చేయగా.. నిల్వ ఉంచిన, కాలం చెల్లిన ఆహార పదార్థాలు, అపరిశుభ్రత వెలుగు చూశాయి. ఇదే క్రమంలో పాల్వంచ, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు వంటి పట్టణాల్లోనూ తనిఖీలు చేయాలని జిల్లా వాసులు డిమాండ్ చేస్తున్నారు. అంతేకాదు.. మున్సిపాలిటీల్లో నామ్‌కే వాస్తేగా ఉన్న కబేళా, కమేళాలపై కూడా దృష్టి సారించాలని కోరుతున్నారు.

సింగరేణిలో మెడికల్ బోర్డు మాఫియా..
సింగరేణి ఉద్యోగుల సౌలభ్యం కోసం తెచ్చిన కారుణ్య నియామకాల ప్రక్రియ లోపభూయిష్టంగా మారింది. అనారోగ్య కారణాలతో విధులు నిర్వర్తించలేని కార్మికులు తమ వారసుడికి ఉద్యోగం ఇప్పించాలంటే కనీసం రూ.ఐదు లక్షలు సమర్పించుకోనిదే పని జరగని పరిస్థితి నెలకొంది. డబ్బులు పోయినా ఉద్యోగం వస్తుందనే నమ్మకంతో వ్యవస్థీకృతంగా మారిన 'మెడికల్ బోర్డు మాఫియా'కు కార్మికులు తమ కష్టార్జితాన్ని ధారపోస్తున్నారు. మెడికల్ మాఫియా చుట్టూ ఆరోపణలపై గత నాలుగు రోజులుగా ఏసీబీ దృష్టి సారించింది. బోర్డుకు హాజరైన కార్మికుల నుంచి వివరాలు సేకరిస్తోంది. ఇదే తరుణంలో ఇప్పటివరకు నిర్వహించిన బోర్డులలో కీలకంగా వ్యవహరించిన వ్యక్తుల ఆదాయం, ఆస్తులపై కూడా దృష్టి సారించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.


చికిత్స చేయాల్సిందే..
గత రెండు నెలల కాలంలో జిల్లాలో నలుగురు ప్రభుత్వ ఉద్యోగులు ఏసీబీకి పట్టుబడ్డారు. పాల్వంచలో నకిలీ హోమియోపతి మందుల విక్రయం వెలుగుచూసింది. దీంతో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు హైరానా పడుతున్నారు. ఆరోగ్య శాఖకు సంబంధించి గతంలో సర్వజన ఆస్పత్రి పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు, పనులు చేపట్టారనే ఆరోపణలు వచ్చాయి. అదే విధంగా వైద్య విధాన పరిషత్ పరిధిలో డాక్టర్ల నియామకంలోనూ అక్రమాలు జరిగాయంటూ అందిన ఫిర్యాదులపై ఇప్పటికే విచారణ మొదలైంది. దీన్ని మరింత లోతుగా విచారణ చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. వీటితో పాటు వ్యవసాయ సీజన్ కావడంతో నకిలీ విత్తనాల దందాపై కూడా దృష్టి పెట్టాలని, తనిఖీలు చేయాలని రైతులు కోరుతున్నారు. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో ఏజెంట్ల దందాకు సైతం అడ్డుకట్ట వేయాలని జిల్లా వాసులు అంటున్నారు.

దారితప్పిన రవాణా శాఖ..
జిల్లాలో పాల్వంచ, అశ్వారావుపేటలో రెండు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఉన్నాయి. ఈ రెండూ అవినీతికి ఆలవాలంగా మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడి సిబ్బంది, వారికి అనుబంధంగా పని చేస్తున్న ప్రైవేటు సైన్యం దందాలు మితిమీరడంతో డ్రైవర్లే ఏసీబీకి ఫిర్యాదు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మంగళవారం జరిగిన ఏసీబీ దాడిలో అశ్వారావుపేట చెక్‌పోస్టులో అవినీతి బాగోతం బట్టబయలైంది. మరో రెండు వారాల్లో పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ఆయా పాఠశాలల బస్సుల ఫిట్‌నెస్ పరీక్షల కాలపరిమితి ఈనెల 15తో ముగిసింది. కానీ గత రెండు వారాలుగా ఫిట్‌నెస్ రెన్యువల్ కోసం ఆర్టీఏ కార్యాలయానికి వస్తున్న బస్సుల సంఖ్య వేళ్ల మీద లెక్కపెట్టేలా ఉంది. చివరి నిమిషంలో ఆర్టీఏ కార్యాలయాలకు స్కూలు బస్సులు పంపి, తూతూ మంత్రంగా తనిఖీలు జరిపించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేయించుకోవడం జిల్లాలో రివాజుగా మారింది.

భానుడి ప్రతాపం



నిర్మానుష్యంగా కొత్తగూడెం ప్రధాన రహదారి



- రోహిణి కార్తెతో భగభగలు
- జిల్లాలో 44 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత
- వడగాడ్పులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి

చుంచుపల్లి: రోహిణి కార్తె ఆరంభం కావడంతో సూర్యుడు ప్రతాపం చూపుతున్నాడు. బుధవారం జిల్లా వ్యాప్తంగా 44 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ వేసవి సీజన్ రెండో విడతలో ఇవే గరిష్ట ఉష్ణోగ్రతలు కావడం గమనార్హం. సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి. పల్లెలు, పట్టణాలు నిప్పుల కుంపటిని తలపించాయి. రోజంతా ఎండ వేడిమి, వడగాడ్పులతో జనం అల్లాడిపోయారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ఇళ్లలో నీడపట్టున ఉంటున్నా భయపడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లినా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇక ద్విచక్ర వాహనాలపై విధులకు వచ్చిపోయే ఉద్యోగులు, ఇతర ప్రజలు భానుడి ప్రతాపాన్ని తట్టుకునేందుకు టోపీలు, టవళ్ల వంటి రక్షణ కవచాలు ధరిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచే సూర్యుడు నిప్పులు చెరగటంతో జిల్లాలో 44 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు దాటి నమోదయ్యాయి. ఇక ఉదయమే ఎండ తీవ్రంగా ఉండటంతో పనుల నిమిత్తం బయటకు వెళ్లిన వారు 11 గంటల్లోపే ఇళ్లకు చేరుకుంటున్నారు. జిల్లాలో ఇటీవల గాలిదుమారంతో కూడిన అకాల వర్షాలు పడగా, వాతావరణం కొంత చల్లబడింది. దీంతో పగటి ఉష్ణోగ్రతలు 38, 39 డిగ్రీలకు పడిపోయాయి. ఇక ఈనెల 25 నుంచి రోహిణి కార్తె మొదలు కావటంతో రెండు, మూడు రోజులుగా మళ్లీ ఎండలు దంచికొడుతున్నాయి.

జూన్ 7 వరకు ఎండలేనా..?
రోహిణి కార్తెలో రోకళ్లు పగిలే ఎండలు కాస్తాయనే నానుడి ఉంది. ఇక కార్తె ప్రభావం దాదాపు 12 నుంచి 15 రోజుల వరకు ఉంటుంది. అంటే దాని ప్రభావంతో జూన్ 7 వరకు భీకర ఎండలు కాచే అవకాశం ఉంది. ప్రతి ఏడాది ఇదే సమయంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. గతేడాది సైతం 47, 48 డిగ్రీలకు పైగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రస్తుతం రోహిణి కార్తె ఆరంభంతో పాటుగా వేర్వేరు కారణాల రీత్యా వచ్చే రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. రాబోయే పది రోజుల్లో ఎండలు మండిపోనున్న నేపథ్యంలో వడదెబ్బ బారిన పడకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

జిల్లాలో ఉష్ణోగ్రతల వివరాలిలా..

అశ్వాపురం	45.8
భద్రాచలం	44.9
ఈ బయ్యారం	44.5
యానంబైలు	44.3
గరిమెళ్లపాడు	44.2
సీతారాంపట్నం	44.0
దుమ్ముగూడెం	44.0
మణుగూరు	44.0
లక్ష్మీదేవిపల్లి	43.9
పాత కొత్తగూడెం	42.9
కరకగూడెం	42.8
సత్యనారాయణపురం	42.7
నాయుడుపేట	42.3
అశ్వారావుపేట	42.3
సుజాతనగర్	42.2
మద్దుకూరు	42.2
మల్కారం	42.1
మండలపల్లి	42.0
ఆళ్లపల్లి	41.6
జూలూరుపాడు	41.6

పొడి దుక్కుల్లో విత్తనాలు వేయొద్దు

డీఏఓ బాబూరావు



మాట్లాడుతున్న డీఏఓ బాబూరావు

పాల్వంచరూరల్ : రైతులు తొందరపడి ఇంకా వేడి చల్లారని పొడి దుక్కుల్లో పత్తి విత్తనాలను వేయొద్దని, రెండు సార్లు వర్షం కురిసిన తర్వాత వేస్తేనే మొలకెత్తుతాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు సూచించారు. పాల్వంచ సహకార సంఘం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు 2.60 లక్షల ఎకరాల్లో పత్తి సాగుచేసే అవకాశం ఉందని అంచనా వేసినట్లు తెలిపారు. ఇందుకు ఐదు లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు అవసరమని, ప్రస్తుతం 2.60 లక్షల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వరి 1.60 లక్షల ఎకరాల్లో సాగుచేసే అవకాశం ఉందని, ఇందుకు 40 వేల క్వింటాళ్ల విత్తనాల అవసరమని తెలిపారు. ఈ విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. మిర్చి 30 వేల ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేశామని, 32 క్వింటాళ్ల విత్తనాలు అవసరం కాగా సరిపడా ఉన్నాయని తెలిపారు. జీలుగ విత్తనాలు 3,900 క్వింటాళ్లకు 2,600 క్వింటాళ్లు పీఏసీఎస్‌ల్లో అందుబాటులో ఉన్నాయని, మరో 1,300 క్వింటాళ్లు వారం రోజుల్లో వస్తాయని వివరించారు. పిల్లిపెసర 100, జనుము 200 క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ విత్తనాలు పొడిదుక్కుల్లో వేయొద్దని, 60 మి.మీ. వర్షపాతం నమోదైన తర్వాత వేస్తేనే మొలకెత్తుతాయని సూచించారు. సమావేశంలో ఏడీఏ లాల్‌చంద్, మండల వ్యవసాయ అధికారి శంకర్, సొసైటీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పనులు సకాలంలో పూర్తి చేయండి

ఆయిల్‌ఫెడ్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి



పామాయిల్ ఫ్యాక్టరీలో పరిశీలిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

అశ్వారావుపేటరూరల్: స్థానిక పామాయిల్ ఫ్యాక్టరీలో బాయిలర్ నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆయిల్‌ఫెడ్ ప్లాంట్స్ అండ్ ప్రాజెక్ట్స్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన అశ్వారావుపేట, దమ్మపేట మండలం అప్పారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీలను పరిశీలించారు. ఆయా ఫ్యాక్టరీల్లో చేపట్టిన వివిధ పనుల పురోగతిపై ఆరా తీశారు. అనంతరం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. అశ్వారావుపేట ఫ్యాక్టరీలో రూ.30 కోట్లతో నిర్మిస్తున్న బాయిలర్ పనులు సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించినట్లు చెప్పారు. అప్పారావుపేట ఫ్యాక్టరీలో రూ.32 కోట్లతో చేపట్టిన వెస్ట్ బాబర్, రీసైక్లింగ్ పవర్ ప్లాంట్, 30 టన్నుల సామర్థ్యం విస్తరణ పనులు పూర్తయినట్లు తెలిపారు. త్వరలో సీజన్ మొదలవుతున్నందున సిబ్బంది అంతా గెలల క్రషింగ్‌కు సిద్ధంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఫ్యాక్టరీ మేనేజర్లు నాగబాబు, కల్యాణ్, సిబ్బంది వెంకటేష్, గోపాలకృష్ణ, పవన్ పాల్గొన్నారు.

ఎంటీపీ అనుమతిపై డీఎంహెచ్‌ఓ సమీక్ష



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శిరీష

కొత్తగూడెంరూరల్: మెటర్నల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటీపీ) అనుమతి కోసం వైద్యులు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి శిరీష సూచించారు. బుధవారం తన కార్యాలయంలో వైద్యులతో డీఎంహెచ్‌ఓ శిరీష సమీక్ష నిర్వహించారు. ఎంటీపీ కోసం దరఖాస్తు చేసుకుంటే అనుమతి ఇస్తామని తెలిపారు. సమావేశంలో జెడ్‌పీసీఓ కె.చంద్రశేఖర్, వైద్యులు ఎస్.సరళ, వీరబాబు, ఆర్.చైతన్య, ఎండీ ఫయీజ్‌ముహిద్దీన్, పి.బేబి పాల్గొన్నారు.

గ్రూప్ -1కు 8,875 మంది అభ్యర్థులు

- 21 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- కలెక్టర్ ప్రియాంక ఆల వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల, పక్కన ఎస్పీ రోహిత్‌రాజ్

సూపర్‌బజార్(కొత్తగూడెం): గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్షకు జిల్లాలో 8,875 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. పరీక్ష ఏర్పాట్లపై ఎస్పీ రోహిత్‌రాజ్‌తో పాటు ఇతర అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జూన్ 9న జరుగనున్న పరీక్ష కోసం జిల్లాలో 21 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థుల బయోమెట్రిక్ వెరిఫికేషన్ నిర్వహించాలని సూచించారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు కేంద్రాల్లోకి అనుమతించొద్దని ఆదేశించారు. నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని, సీసీ కెమెరాలు అమర్చాలని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టంగా పరీక్ష నిర్వహించాలని సూచించారు.

అందుబాటులో విత్తనాలు..
వర్షాకాలంలో సాగుకు అవసరమైన విత్తనాలు డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందొద్దని కలెక్టర్ ప్రియాంక అన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో పత్తి 2,16,625 ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేశామని, ఇందుకు 5,41,560 ప్యాకెట్లు, వరి 1,65,854 ఎకరాలకు అవసరమైన 41,464 క్వింటాళ్లు, మొక్కజొన్న 60,200 ఎకరాలకు 4,816 క్వింటాళ్లు, మిర్చి 32,168 ఎకరాలకు అవసరమైన 32 క్వింటాళ్ల విత్తనాలు డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయని వివరించారు. జిల్లాకు ఇప్పటివరకు 2,47,044 ప్యాకెట్ల పత్తి విత్తనాలు వచ్చాయని, అందులో 29,130 ప్యాకెట్లు రైతులు కొనుగోలు చేశారని అన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు 1,311 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ముందుజాగ్రత్తలు పాటించాలి..
వర్షాకాలంలో ముందు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ ప్రియాంక అన్నారు. పరిసరాల పరిశుభ్రతపై రాపిడ్ రెస్పాన్స్ టీంలను జిల్లా, ప్రాథమిక వైద్య కేంద్రం స్థాయిలో ఏర్పాటు చేశామని తెలిపారు. డెంగీ, మలేరియా నివారణకు ఇంటింటికీ వెళ్లి కేసులు ఉంటే గుర్తించి ఆరోగ్య కేంద్రాలకు పంపించాలని సూచించారు. మున్సిపాలిటీల పరిధిలో కాలువల పూడిక తీయించాలని కమిషనర్లను ఆదేశించారు. గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రం చేయించాలన్నారు. జిల్లాలోని ప్రతి ఆస్పత్రి, డయాగ్నస్టిక్ సెంటర్లను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆదేశించారు. ఆయా సమావేశాల్లో డీఆర్‌ఓ రవీంద్రనాథ్, టీజీపీఎస్సీ రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ జగన్మోహన్ రాజు, కొత్తగూడెం డీఎస్పీ రహమాన్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ తిరుమలాచారి, డీఏఓ బాబురావు, ఏడీఏ రవికుమార్, ఏఓలు అరుణ్‌కుమార్, సాయినారాయణ, డీఎంహెచ్‌ఓ శిరీష, రవిబాబు, రాధామోహన్, స్పందన, డీడీఎంహెచ్‌ఓలు సుకృత, రాజ్‌కుమార్, ఐఎంఎ అధ్యక్షుడు భాస్కర్‌రావు, రంగారావు, సుదర్శన్ పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు సకాలంలో అందించాలి
కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సకాలంలో పాఠ్య పుస్తకాలు అందించాలని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కొత్తగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని గోడౌన్‌లో పుస్తకాల పంపిణీని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాకు రావాల్సిన అన్ని పుస్తకాలు జిల్లా కేంద్రానికి చేరుకున్నాయని, అన్ని మండలాలకు త్వరలోనే సరఫరా అవుతాయని చెప్పారు. పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులందరికీ అందజేసేలా ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి, విద్యాశాఖ కో– ఆర్డినేటర్లు ఎ.నాగరాజశేఖర్, ఎస్‌కే సైదులు, ఎంఈఓ జుంకీలాల్, గోడౌన్ ఇన్‌చార్జ్ రవి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయాలపై సీఎండీ సమీక్ష
ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ అంతరాయాలపై టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి బుధవారం రాత్రి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వరంగల్ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 జిల్లాల్లో ప్రస్తుత సీజన్‌లో విద్యుత్ అంతరాయాలు, అధిగమించే చర్యలపై చర్చించారు. జూన్ చివరి నాటికి ప్రీ మాన్‌సూన్ పనులు పూర్తి చేసి నిరంతర విద్యుత్ సరఫరాకు సమగ్ర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయ విద్యుత్‌కు రైతులు చేసుకున్న దరఖాస్తులు, వాటి ప్రగతి గురించి అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు అధిక ప్రాధాన్యం ఇచ్చి వానాకాలం సీజన్ నాటికి పూర్తి చేయాలన్నారు. నిబంధనల మేరకు బకాయిలు వసూలు చేయాలని సూచించారు. వీసీలో ఖమ్మం ఎన్పీడీసీఎల్ సర్కిల్ ఆపరేషన్స్ ఎస్ఈ ఎ. సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఎవరికీ శాశ్వతం కాదు

ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్



విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ప్రతీక్ జైన్ తదితరులు

భద్రాచలంటౌన్: ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి విరమణ అనేది తప్పనిసరని, ఎవరికీ ఉద్యోగం శాశ్వతం కాదని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ అన్నారు. ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న జీసీసీ డీఎం విజయ్‌కుమార్‌ను బుధవారం ఐటీడీఏ సమావేశం మందిరంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. విజయ్ గిరిజన సహకార సంస్థ వైజాగ్‌లో జూనియర్ మేనేజర్‌గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించి, అంచలంచెలుగా ఎదిగి ఉద్యోగాన్ని సక్రమంగా నిర్వహించి మంచి పేరు తెచ్చుకున్నారని అభినందించారు. 32 సంవత్సరాలు విధులు నిర్వహించి విరమణ పొందడం బాధాకరమైనా శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. అనంతరం డీఎం విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. తనకు సహకరించిన అధికారులు, తోటి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. సిబ్బందికి ఏమైనా ఉద్యోగ పరంగా సమస్యలుంటే తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, ఏడీ భాస్కరన్, మనీర్ పాషా, అశోక్, రమణయ్య, నరసింహారావు, ఆదినారాయణ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటితో ముగియనున్న క్యాంప్



శిక్షణ పొందుతున్న గిరిజన విద్యార్థులు

పాల్వంచరూరల్: గిరిజన విద్యార్థులకు వివిధ క్రీడల్లో మెలకువలు నేర్పించేందుకు ఏటా నెల రోజుల పాటు నిర్వహించే సమ్మర్ కోచింగ్ క్యాంప్ ఈసారి రెండు వారాలు మాత్రమే నిర్వహించి ముగించారు. ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ ఆదేశాల మేరకు మండలంలోని కిన్నెరసాని గిరిజన మోడల్ క్రీడా పాఠశాల మైదానంలో వివిధ క్రీడాంశాల్లో ఉమ్మడి జిల్లా నుంచి 60 మంది గిరిజన విద్యార్థినులు, 60 మంది బాలురు మొత్తం 120 మందికి ఈ నెల 16వ తేదీ నుంచి సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను నిర్వహించారు. ఆర్చరీ, అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, హైజంప్, లాంగ్‌జంప్ వంటి క్రీడల్లో ప్రత్యేకంగా 12 మంది కోచ్‌లను నియమించి కోచింగ్ ఇచ్చారు. గురువారం క్యాంప్ ముగియనున్నట్లు ఐటీడీఏ క్రీడల అధికారి గోపాల్‌రావు తెలిపారు.

ప్రాణం తీసిన సినిమా పాట!

- విద్యుదాఘాతంతో యువకుడు మృతి

అశ్వారావుపేటరూరల్: వివాహ వేడుకలో తనకు ఇష్టమైన సినిమా పాట పెట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని కంట్లం గ్రామానికి చెందిన మడకం కామరాజు (33) మంగళవారం రాత్రి గ్రామంలో జరిగిన ఓ వివాహ వేడుకకు వెళ్లాడు. అక్కడ ఏర్పాటు చేసిన డీజే వద్ద కొద్దిసేపు డ్యాన్స్ చేసి, తనకు ఇష్టమైన పాట పెట్టేందుకు డీజే సిస్టం (పరికరాలు) దగ్గరకు వెళ్లి పాటలు మార్చే క్రమంలో ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే కింద పడిపోయాడు. గమనించిన స్థానికులు హుటాహుటిన అశ్వారావుపేట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు మృతదేహానికి పోస్టుమార్టం జరిపించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



బెల్లం పానకం డ్రమ్ములను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

దుమ్ముగూడెం: మండలంలోని ములకనాపల్లి, సుజ్ఞానపురం, చింతగుప్ప గ్రామాల్లోని అటవీ ప్రాంతంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కరమ్‌చంద్ ఆధ్వర్యంలో బుధవారం నాటుసారా స్థావరాలపై దాడులు చేపట్టారు. గుడుంబా తయారీకి ఉపయోగించే 4,200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. భద్రాచలం ఎక్సైజ్ సీఐ రహీమున్నీషాబేగం, ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాస్, గౌతమ్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు



బెల్లం పానకాన్ని పారబోస్తున్న పోలీసులు

కరకగూడెం: గ్రామాల్లో గుట్టు చప్పుడు కాకుండా నాటుసారా విక్రయించినా, తయారు చేసినా కఠినచర్యలు తప్పవని కరకగూడెం ఎస్‌ఐ రాజేందర్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని కలవలనాగారం అటవీ ప్రాంతంలో గుడుంబా స్థావరాలపై ఆకస్మిక దాడి చేశారు. 150 లీటర్ల బెల్లం పానకం, 20 లీటర్ల గుడుంబా, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారు. పోలీసుల రాకను గమనించిన గుడుంబా తయారీదారులు పరారైనట్లు తెలుస్తోంది.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

ఖమ్మంరూరల్: మండలంలోని పెద్దతండా పంచాయతీ ఇందిరమ్మకాలనీకి చెందిన మాళోత్ నందిని (19) వివాహిత ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గార్ల మండలం పుల్లూరుకు చెందిన నందినికి ఇందిరమ్మకాలనీకి చెందిన దుస్సా సుమన్‌తో ఏడాది కిందట వివాహమైంది. కొంత కాలం నుంచి అదనపు కట్నం తెమ్మని అత్త కల్యాణి, భర్త సుమన్ వేధింపులకు గురి చేస్తున్నారు. దీంతో నందిని ఇంట్లో దూలానికి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అత్త, భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.

పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.14,229

నాణ్యత లేని వంట.. | తినక తప్పదంట..

కుళ్లిన మాంసం.. బూజు పట్టిన ఐస్‌క్రీమ్

- వంటశాలల్లో డ్రెయినేజీ నీరు.. చెత్త, ఈగలు అదనం
- పైకి మాత్రం ఆకర్షణీయంగా అలంకరణ
- అధికారుల తనిఖీల్లో బయటపడిన రెస్టారెంట్లు, హోటళ్ల బాగోతం



భద్రాచలంలోని ఓ రెస్టారెంట్‌లో ఫంగస్ వచ్చిన ఐస్‌క్రీమ్ బయటకు తీస్తున్న అధికారి (ఫైల్)

ఖమ్మంమయూరిసెంటర్: దుమ్ము, ధూళితో పాటు ఈగలు, పురుగులతో కూడిన అపరిశుభ్ర వాతావరణంలో వంటశాల.. ఇడ్లీ పిండిలో చనిపోయిన ఈగలు.. వండిన ఆహార పదార్థాల్లో భవనాల స్లాబ్ పెచ్చులు, బూజు, మట్టి.. ఫంగస్, పురుగులతో దుర్వాసన వస్తున్న ఐస్‌క్రీమ్.. బిర్యానీలో కేన్సర్ కారకాలైన కృత్రిమ హానికరమైన రంగులు.. ఇవన్నీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని హోటళ్ల, రెస్టారెంట్లలో మెనూ! ఇటీవల అధికారులు చేపట్టిన తనిఖీల్లో ఈ అంశాలు బయటపడగా.. కుటుంబసభ్యులతో ఓ పూట సరదాగా బయట భోజనం చేద్దామని భావిస్తున్న వారు ఆందోళనకు గురవుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఖమ్మం, భద్రాచలంలో పలు హోటళ్లు, రెస్టారెంట్లలో అధికారులు చేసిన తనిఖీల్లో ఈ బాగోతాలు బయటపడగా అధికారులే విస్తుపోవడం గమనార్హం.

అంతటా ఇదే తీరు..

గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాలనే తేడా లేకుండా ఏ టిఫిన్ సెంటర్, ఏ హోటల్, ఏ రెస్టారెంట్‌లో చూసినా కనీస నిబంధనలు పాటించకుండా ఆహారాన్ని తయారు చేసి విక్రయిస్తున్న వారే ఎక్కువ. ఆహారం మిగిలితే రోజుల తరబడి ఫ్రిడ్జ్‌ల్లో నిల్వ చేసి కస్టమర్లకు వడ్డిస్తున్నారు. హోటళ్లను అందంగా.. కుర్చీలను పరిశుభ్రంగా ఉంచుతూ ఒక్కసారి అక్కడికి వచ్చిన వారు మళ్లీ మళ్లీ రావాలనే అభిప్రాయాన్ని కల్పిస్తున్న యాజమాన్యాలు.. ఆహారం నాణ్యత విషయంలో మాత్రం నిబంధనలు పాటించడం లేదు. ఎవరూ చూడరు కదా అనే ధీమాతో వంటశాలలను అసలు పట్టించుకోవడం లేదు.

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూ..

ఇంట్లో కంటే బయట భోజనం చేసే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇదే అదనుగా వ్యాపారులు టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, రెస్టారెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఖమ్మంలో ఒక్కో వీధిలో పదుల సంఖ్యలో రెస్టారెంట్లు తెరిచారు. ఇందులో చాలా వాటికి మున్సిపల్, ఫుడ్ సేఫ్టీ లైసెన్స్‌లు కూడా లేవని సమాచారం. వారు కనీస నిబంధనలు పాటించకుండా ఆహారాన్ని తయారు చేసి విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఉమ్మడి జిల్లాలో అనేక టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్లు, భోజనశాలలకు అనుమతులు లేనట్లు తెలుస్తోంది.

కొరవడిన పర్యవేక్షణ..

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే బాధ్యతను అధికారులు తీసుకోవాలి. హోటళ్ల నిర్వహణపై నిరంతరం పర్యవేక్షిస్తూ నాణ్యమైన, కల్తీలేని ఆహారం అందేలా తనిఖీలు చేపట్టాలి. ఫుడ్‌సేఫ్టీ అధికారులతోపాటు మున్సిపల్, కార్పొరేషన్ అధికారులు హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లలో తనిఖీలు చేయాలి. కానీ ఫుడ్ సేఫ్టీ అధికారులు ఏడాదికి ఒకటి, రెండు సార్లు మాత్రమే తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటుండగా.. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులైతే ఆ దిక్కే చూడడం లేదు. ఖమ్మం నగరంలో ఏ హోటల్‌పై అయినా ఫిర్యాదు వస్తే మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అక్కడికి వెళ్లి యజమానులతో కుమ్మక్కై మామూళ్లు తెచ్చుకుని చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. దీంతో రెస్టారెంట్ల నిర్వాహకులు చేసిందే వంట.. పెట్టిందే ఆహారంగా మారింది. దీనిపై ఫుడ్‌సేఫ్టీ అధికారుల వివరణ కోరగా.. కమిషనర్ ఆదేశాలతో ఉమ్మడి జిల్లాలో ఆరు హోటళ్లలో తనిఖీలు చేశామని, వంటశాలలు సక్రమంగా లేవని, నిర్వాహకులపై 4ఏ కేసు బుక్ చేసేందుకు ఫైళ్లు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. హోటల్ నిర్వాహకులు నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇదే కస్టమర్ల ఆహారం..

ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉమ్మడి జిల్లాలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీ చేయగా.. అక్కడి వాతావరణంతో అధికారులే విస్తుపోయారు. ఖమ్మంలోని ఓ హోటల్‌ను సందర్శించగా అపరిశుభ్రంగా ఉన్న రిఫ్రిజిరేటర్‌లోనే కుళ్లిన మాంసాన్ని నిల్వ చేయడం, గడువు ముగిసిన ఆహార పదార్థాలను వినియోగించడం, ఐస్‌క్రీమ్‌కు ఫంగస్ వచ్చి దుర్వాసన వస్తుండటం గమనించారు. మరికొన్ని హోటళ్లలో ప్లాస్టిక్ కవర్లలోనే ఆహార పదార్థాలను నిల్వ చేస్తున్నారు. కస్టమర్లకు వడ్డించే ఆహారంలో తీగలు, వెంట్రుకలు, బస్తాల దారాలు వంటివి దర్శనమిస్తున్నాయి. వీటిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు కూడా అందాయి. వారు తనిఖీలు చేసినా హోటల్ నిర్వాహకులు మాత్రం తీరు మార్చుకోవడం లేదు.

ఉమ్మడి జిల్లాలో హోటళ్లు, రెస్టారెంట్ల వివరాలు..

మున్సిపల్/ కార్పొరేషన్	రెస్టారెంట్లు	హోటళ్లు
ఖమ్మం	20	300
మధిర	05	40
సత్తుపల్లి	07	30
వైరా	06	27
కొత్తగూడెం	09	200
పాల్వంచ	10	120
ఇల్లెందు	05	20
మణుగూరు	03	28

(ఖమ్మంలో తోపుడు బండ్లు 500లకు పైగా ఉన్నాయి.)

అనుమానాలెన్నో..?

- పథకం ప్రకారం జరిగిన హత్యా? నిజంగానే ప్రమాదం జరిగిందా?
- పోలీసుల పర్యవేక్షణలో తల్లీ, కూతుర్ల అంత్యక్రియలు



పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను అంబులెన్స్‌లో ఎక్కిస్తున్న దృశ్యం



బావోజీతండాకు చేరిన మృతదేహాలు

రఘునాథపాలెం: మండలంలోని హరియాతండా సమీపంలో మంచుకొండ – పంగిడి ప్రధాన రహదారి పక్కన చెట్టును ఢీకొన్న కారు ప్రమాదంలో తల్లీ, ఇద్దరు కుమార్తెలు మృతిచెందిన విషయం విదితమే. కానీ, ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది పథకం ప్రచారం జరిగిన హత్యా? లేక నిజంగానే ప్రమాదం జరిగిందా? అనే అంశంపై పలువురు పలు రకాల వాదనలు వినిపిస్తున్నారు. మంగళవారం రాత్రి కారు ప్రమాదంలో దుర్మరణం చెందిన తల్లీకూతుర్ల అంత్యక్రియలు బుధవారం మండలంలోని బావోజీతండాలో పోలీసుల సమక్షంలో నిర్వహించారు. ఆది నుంచి అనుమానం వ్యక్తం చేస్తున్న మృతురాలి తండ్రి, హరిసింగ్, తల్లి పద్మ, సోదరుడు, సోదరితో పాటు కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వాస్పత్రి వద్ద బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆందోళన చేశారు. మృతురాలి భర్త, ఫిజియోథెరపిస్ట్ అయిన బోడా ప్రవీణ్ కారణమని, ఆయన్ను తీసుకొచ్చిన తర్వాతనే మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించాలని భీష్మించారు. మరో యువతితో వివాహేతర సంబంధం నెరుపుతున్న ప్రవీణ్‌ను భార్య కుమారి ప్రశ్నిస్తున్న నేపథ్యంలోనే తల్లీ కూతుర్లను హతమార్చి యాక్సిడెంట్‌గా చిత్రీకరిస్తున్నాడని వందలాది మంది ఆస్పత్రికి చేరుకుని నిరసన తెలిపారు. ప్రవీణ్‌పై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. రఘునాథపాలెం సీఐ శ్రీహరి, ఎస్‌ఐలు, పోలీసులు జోక్యం చేసుకొని పోస్టుమార్టం నివేదిక అనంతరం విచారణ చేపట్టి చర్యలు చేపడుతామని మృతుల కుంటుంబ సభ్యులకు నచ్చజెప్పి పోస్టుమార్టం పూర్తి చేయించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ ప్రాంతంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రవీణ్ తరఫు బంధువులు సైతం అక్కడికి వచ్చేందుకు భయపడ్డారు. సాయంత్రం 4 గంటల తర్వాత మూడు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి, బావోజీతండాకు తరలించేందుకు వాహనం ఎక్కించారు. కాగా, పోస్టుమార్టంలో ఏం తేలిందనే విషయం డాక్టర్లు చెప్పకుండానే ఎలా వెళ్లారని, ఈ విషయం తేలేవరకు మృతదేహాలను తీసుకెళ్లమంటూ మళ్లీ ఆందోళన చేశారు. మృతదేహాలను దించి శవాల గదిలోకి తరలించారు. మళ్లీ పోలీసులు కలగజేసుకుని, సర్దిచెప్పి మృతదేహాలను పోలీసు బందోబస్తు నడుమ బావోజీతండాకు తరలించి ఇద్దరు చిన్నారులను పూడ్చిపెట్టారు. కుమారి మృతదేహాన్ని దహనం చేశారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు విలపించిన తీరు చూసి అక్కడివారంతా కన్నీటిపర్యంతమయ్యారు. ముఖ్యంగా చిన్నారుల మృతదేహాలను చూసిన గ్రామస్తులంతా గుండెలవిసేలా రోదించారు.

ఏం జరిగి ఉంటుంది?

కారు ప్రమాదంలో డాక్టర్ ప్రవీణ్ గాయాలతో బయటపడటం, భార్య, ఇద్దరు కుమార్తెలు మృతి చెందడంపై కుమారి తల్లిదండ్రులు అనుమానిస్తున్నారు. కొన్నేళ్లుగా అల్లుడు తమ కుమార్తెను సరిగా చూసుకోవడం లేదని, వివాహేతర సంబంధం పెట్టుకుని వేధిస్తున్నాడని ఆరోపిస్తున్నారు. కారుకు ప్రమాదం జరిగినప్పుడు తల్లీకూతుర్లు వెనుక సీట్లో చనిపోయి ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత సమీపంలోని హరియాతండావాసులు అక్కడికి చేరుకునే సరికి ప్రవీణ్ ముందు సీట్లో, కుమారి, ఇద్దరు చిన్నారులు వెనుక సీట్లు మృతి చెంది ఉన్నారని గుర్తించారు. కారు ముందు భాగం చెట్టును ఢీకొడితే వెనుక ఉన్న వాళ్లు ఎలా మృతిచెందారనే చర్చ సాగుతోంది. పోస్టుమార్టం నివేదిక వస్తేనే అసలు విషయం తెలుస్తుందని, కారులో ఎవరు ఎక్కడ కూర్చున్నారో ఎవరూ స్పష్టంగా చెప్పడం లేదని పోలీసులు చెబుతున్నారు. కాగా, కారు ప్రమాదంలో గాయపడిన బోడా ప్రవీణ్ నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

విద్యార్థి మృతిపై కేసు నమోదు



నిరసన తెలుపుతున్న ఆదివాసీ సంఘాల జేఏసీ నాయకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం కూనవరం రోడ్డులోని మారుతి పారా మెడికల్ కళాశాల విద్యార్థి అనుమానాస్పద మృతిపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన్నట్లు పట్టణ సీఐ సంజీవరావు బుధవారం తెలిపారు. విద్యార్థి మృతికి గల ఆధారాల సేకరణ, సీసీ కెమెరా ఫుటేజ్ పరిశీలన, సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకుని సాక్షులను విచారిస్తామని, ఘటనకు సంబంధించి ప్రజల వద్ద ఎలాంటి ఆధారాలు ఉన్నా పోలీసులకు ఇచ్చి సహకరించాలని కోరారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

నర్సింగ్ విద్యార్థిని పగిడిపల్లి కారుణ్య మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి, మారుతి పారామెడికల్ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ ఆదివాసీ సంఘాల జేఏసీ, హ్యూమన్ రైట్స్ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం భద్రాచలం ఐటీడీఏ ఎదుట నిరసన చేపట్టి పీఓ ప్రతీక్ జైన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. అణగారిన వర్గాలకు చెందిన ఆడబిడ్డ అనుమానాస్పదంగా మరణిస్తే ప్రభుత్వ యంత్రాంగం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించడం శోచనీయమన్నారు. అగ్రవర్ణాలకు ఏదైనా అన్యాయం జరిగితే నిందితులను ఎన్‌కౌంటర్ చేస్తారని, కానీ, కారుణ్య మృతిపై ఎందుకు సరైన విచారణ జరిపించడం లేదని ప్రశ్నించారు.

గోదావరిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని వెలికితీస్తున్న గజ ఈతగాళ్లు

బూర్గంపాడు: ఇరవెండి సమీపంలోని పంప్ హౌస్ వద్ద నుంచి మంగళవారం గోదావరి దాటుతూ గల్లంతైన వ్యక్తి మృతదేహం బుధవారం లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. దుమ్ముగూడెం మండలం తూరుబాక గ్రామ పంచాయతీలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన ఎర్రబోలు కోటిరెడ్డి(30) శనివారం రామచంద్రాపురంలోని సోదరి ఇంటికి వచ్చి మంగళవారం ఉదయం గోదావరి అవతల ఒడ్డున ఉన్న స్వగ్రామం వెళ్లేందుకు ఈదుకుంటూ నదిలోకి వెళ్లి గల్లంతయ్యాడు. గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. వారు ఘటనాప్రాంతంలో నాటు పడవలతో గాలించినా అతని ఆచూకీ దొరకలేదు. కోటిరెడ్డి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుమన్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. బుధవారం గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని బూర్గంపాడు సివిల్ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

వ్యక్తి అనుమానాస్పద మృతి!



బాదే చిట్టిబాబు మృతదేహం

కరకగూడెం: మండల కేంద్రానికి చెందిన బాదే చిట్టిబాబు (55) బుధవారం నిద్రలోనే ప్రాణాలు విడిచాడు. స్థానికుల కథనం ప్రకారం.. చిట్టిబాబు ఇంటి వద్ద ఉదయం 8 గంటలకు పడుకొని మధ్యాహ్నం వరకూ నిద్ర లేవకపోవడంతో గమనించిన చుట్టుపక్కలవారు వచ్చి చూసి చనిపోయినట్లు నిర్ధారించారు. మృతుడి పెద్దకుమారుడు అనారోగ్యంతో భద్రాలచంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆమె తల్లి సహాయంగా అక్కడే ఉంది. గతేడాది చిట్టిబాబు చిన్నకుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, ప్రస్తుతం చిట్టిబాబు మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, స్థానిక పీహెచ్‌సీ వైద్యుడిని వివరణ కోరగా వారం రోజుల నుంచి ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలోనే ఉన్నాయని, ఎండ తీవ్రతకు మరణించే అవకాశం లేదని చెప్పారు.


లారీ ఢీకొని వ్యక్తి మృతి

తల్లాడ: మండలంలోని అంజనాపురం సమీపంలో బుధవారం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి.. లారీ ఢీకొట్టడంతో మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. అంజనాపురం గ్రామానికి చెందిన అనుమోలు రాజా (54) ఉదయం ఆవును తోలుకొని మిట్టపల్లి వెళ్తుండగా శంకర్ దాబా వద్ద వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో రాజా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు హరికృష్ణ ఫిర్యాదు మేరకు తల్లాడ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఐదుగురిపై కేసు

బూర్గంపాడు: బూర్గంపాడు ఏఎస్‌ఐ సత్యంపై దాడికి పాల్పడిన ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ సత్యం ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేశారు. బుధవారం మధ్యాహ్నం బూర్గంపాడు పోలీస్‌స్టేషన్ ఎదురుగా రెండు వర్గాలు గొడవపడుతుండగా ఏఎస్‌ఐ సత్యం అక్కడకు చేరుకుని, వారిని వారించేందుకు యత్నించారు. అందులో ఒకరిద్దరు ఏఎస్‌ఐపై దాడికి పాల్పడ్డారు. పోలీసులు అప్రమత్తమయ్యే సరికి దాడికి పాల్పడినవారు అక్కడి నుంచి పారిపోయారు. ఏఎస్సై సత్యం ఫిర్యాదు మేరకు నిమ్మల హరీశ్, ప్రసాద్, వెంకటేశ్, సారథిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వడదెబ్బతో కూలీ మృతి



రజబెల్లి (ఫైల్)

ఇల్లెందు: అడ్డా మీద కూలీ పనికి వెళ్తున్న స్టేషన్‌బస్తీకి చెందిన రజబెల్లి (55) వడదెబ్బతో మంగళవారం మృతి చెందినట్లు ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు యాకుబ్‌షావలి బుధవారం తెలిపారు. 30 ఏళ్లుగా బొగ్గు కాటా వద్ద పనిచేస్తున్న రజబెల్లి ఏడాది కాలంగా బొగ్గు లేకపోవటం వల్ల కుటుంబాన్ని పోషించుకునేందుకు అడ్డా మీద కూలీకి వెళ్తున్నాడని, ప్రభుత్వం రజబెల్లి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. రజబెల్లి మృతదేహాన్ని కోల్ ట్రాన్స్‌పోర్ట్ అధ్యక్షులు వరద రామచంద్రయ్య, లారీ అసోసియేషన్ అధ్యక్షులు మౌలానా, నల్ల శ్రీను, ఆళ్ల నాగేశ్వరరావు, కొండపల్లి శ్రీను సందర్శించి నివాళులర్పించారు.

వడదెబ్బతో వ్యక్తి..

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పీకే-1 ఇంక్లయిన్‌కు చెందిన వ్యక్తి వడదెబ్బతో మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. రొండ వెంకటేశ్వర్లు (60) బుధవారం కూలీ పనులకు వెళ్లాడు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో చెట్టు కిందకు వెళ్లి అక్కడే మృతిచెందాడు. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

చోరీలకు పాల్పడుతున్న నిందితుడు అరెస్ట్



మాట్లాడుతున్న వన్‌టౌన్ సీఐ కరుణాకర్

కొత్తగూడెంటౌన్: వరుస దొంగతనాలకు పాల్పడుతున్న జుంజునూరి శ్రీనును మంగళవారం కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్ అరెస్టు చేశారు. కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని ప్రశ్నించగా పారిపోయేందుకు యత్నించారు. పోలీసులు వెంటబడి పట్టుకోగా.. ములకలపల్లి చాటివారిగూడెంకు చెందిన జుంజునూరి శ్రీను అని తేలింది. కొత్తగూడెంలో పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడగా రెండు తులాల బంగారం స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

జేసీబీ, ట్రాక్టర్ల పట్టివేత

బూర్గంపాడు: కృష్ణసాగర్ అటవీ ప్రాంతంలో మట్టి తవ్వకాలు జరుపుతున్న జేసీబీ, రెండు ట్రాక్టర్లను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. అటవీ ప్రాంతంలో మట్టి తవ్వుతున్నారనే సమాచారంతో అధికారులు దాడులు నిర్వహించారు. ఒక జేసీబీని, రెండు ట్రాక్టర్లను పట్టుకుని సండ్రెళ్లపాడు నర్సరీకి తరలించారు. మట్టి తవ్వకాలపై విచారణ చేసి కేసు నమోదు చేస్తామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బూర్గంపాడు: సారపాకకు సమీపంలోని గోదావరి నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ఆరు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం రాత్రి గోదావరి నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఇసుక రవాణా చేస్తున్న ఆరు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

ఇద్దరిపై కేసు

చింతకాని: మత్కేపల్లి గ్రామానికి చెందిన రెడ్డిబోయిన కొండల్‌రావు, బల్లి వెంకటలక్ష్మిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. కూలీ డబ్బుల విషయంలో భార్య రెడ్డిబోయిన రమాదేవిపై భర్త కొండల్‌రావు, ఆడపడుచు బల్లి వెంకటలక్ష్మి కర్రతో దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నాగుల్‌మీరా ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

మణుగూరులో పర్యటించిన డైరెక్టర్



మొక్క నాటుతుతున్న డైరెక్టర్ తరుణ్‌కుమార్, అధికారులు

మణుగూరురూరల్: మణుగూరు ఏరియాలో కేంద్ర ప్రభుత్వ పర్యావరణం, అటవీ మంత్రిత్వశాఖ హైదరాబాద్ విభాగ డైరెక్టర్ కత్తుల తరుణ్‌కుమార్ బుధవారం పర్యటించారు. తరుణ్‌కుమార్‌కు ఏరియా ఇన్‌చార్జ్ జీఎం లక్ష్మీపతిగౌడ్, ఏరియా అధికారులు స్వాగతం పలికారు. తొలుత ఆయన జీఎం కార్పొరేట్ (ఎన్విరాన్‌మెంట్) జేవీఎల్ గణపతి, ఏరియా ఇన్‌చార్జ్ జీఎం లక్ష్మీపతిగౌడ్‌తో కలిసి పీకే ఓసీ వ్యూ పాయింట్ నుంచి బొగ్గు ఉత్పత్తి, కేపీయూజీ గనిని పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణకు చేపడుతున్న చర్యలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణ నిరంతర ప్రక్రియ అని, పని ప్రదేశాల్లో మొక్కలను పెంచాలని సూచించారు. అనంతరం పీకేఓసీ-2 సైట్ ఆఫీస్ వద్ద గల గార్డెన్‌లో డైరెక్టర్ తరుణ్‌రెడ్డి, జీఎం కార్పొరేట్(ఎన్విరాన్‌మెంట్) జేవీఎల్ గణపతి మొక్కలు నాటారు. అనంతరం సెట్లింగ్ పాండ్స్, రాక్‌టో వాల్స్, క్రషర్స్, బెల్ట్ కన్వేయర్స్‌తో పాటు పలు విభాగాలను విభాగాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటు జీఎం శ్యాంసుందర్, కేపీయూజీ పీఓ వీరభద్రరావు, రాంబాబు, బైరెడ్డి వెంకటరెడ్డి, మధుబాబు, అధికారి శ్రీనివాసరావు, రవికిరణ్, చిట్టా శ్రీనివాస్, సర్వర్ నబి, ఫారెస్ట్ అధికారి బి కళ్యాణ్ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: కుటుంబ కలహాల కారణంగా వివాహిత ఆత్మహత్యాయత్నం చేసింది. స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మం నగరానికి చెందిన కొత్తపల్లి త్రివేణి (28) కుటుంబ కలహాల కారణంగా తన పుట్టినిల్లు అయిన మండలంలోని ఆరెగూడెంనకు వచ్చింది. బుధవారం నిద్రమాత్రలు మింగింది. కుటుంబ సభ్యులు గమనించి నేలకొండపల్లి ప్రభుత్వ వైద్యశాలకు, అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

తల్లాడ: మండలంలోని మల్సూర్‌తండా వద్ద బుధవారం మోటార్ సైకిల్ అదుపుతప్పి కింద పడటంతో ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు చెందిన వంట మేస్త్రీ కె.నాగేశ్వరరావు తల్లాడ మండలం గొల్లగూడెంలో వంట చేసి తిరిగి వెళ్తుండగా మల్సూర్‌తండా జాతీయ రహదారిపై ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలైన నాగేశ్వరరావును 108లో తిరువూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.